ఆర్గనైజర్ల దోపిడీని అరికట్టాలి

కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన గొంగళ్ల రంజిత్‌కుమార్

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సీడ్‌పత్తి రైతులపై ఆర్గనైజర్ల మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ఆర్గనైజర్ల మోసాలను అరికట్టి, రైతులకు త్రైపాక్షిక ఒప్పందం చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ బుధవారం కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతి పత్రాన్ని అందించారు. వినతి ఇచ్చిన వారిలో బుచ్చిబాబు, వెంకట్రాములు, భూపతి, లక్ష్మన్న, గోపాల్, ఆశన్న తదితరులు ఉన్నారు.

పచ్చదనంతోనే మనుగడ

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- మెడికల్ అంబులెన్సు ప్రారంభం
- అటవీ మంటలను ఆర్పే బ్లోయర్లను అటవీ శాఖ అధికారులకు అందజేసిన ఐసీఐసీఐ ఫౌండేషన్

6

భూసారం.. అవశ్యం

- మట్టి పరీక్షతోనే సరైన పంటల సాగు
- ఉమ్మడి జిల్లాలో ప్రాంతాన్ని బట్టి మారుతున్న నేల స్వభావం
- నేడు అంతర్జాతీయ మృత్తికా దినోత్సవం

6


మట్టి పరీక్ష చేస్తున్న అధికారులు

రెండు రోజులుగా పస్తులు

- నిలిచిన బియ్యం సరఫరా
- ఆగిన మధ్యాహ్న భోజన పథకం
- ఇంటి నుంచి అన్నం తెచ్చుకుంటున్న విద్యార్థులు

6


మధ్యాహ్న భోజనం వండకపోవడంతో ఇంటి నుంచి టిఫిన్ బాక్సు తెచ్చుకున్న విద్యార్థులు


మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో కిటికీలకు తలుపులు లేని ఎస్సీ సంక్షేమ వసతి గృహం


మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌లో కిటికీలకు తలుపులు లేని కేజీబీవీ

సంక్షేమం వణుకు



- గురుకులాలు, కేజీబీవీల్లో పెరిగిన చలితో విద్యార్థుల ఇబ్బందులు
- ఉదయాన్నే చన్నీటి స్నానంతో తరచూ జలుబు, దగ్గుతో సతమతం
- అద్దె భవనాల్లో అరకొర వసతులు
- కిటికీలు లేని భవనాలు.. నాణ్యత కొరవడిన భోజనం
- స్కావెంజర్లు లేకపోవడంతో దుర్గంధంగా మరుగుదొడ్లు, మెస్‌లు
- ప్రత్యేక అధికారులు మరింత దృష్టి సారిస్తే మేలంటున్న విద్యార్థులు

చలి తీవ్రత పెరిగింది... సాయంత్రం కాగానే ప్రజలందరూ ఇళ్లకు చేరుకొని వెచ్చగా ఉంటారు... కానీ, ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. సొంత ఖర్చుతో ఇంటి వద్దే చదువుకునే ఆర్థిక స్థోమతలేని చిన్నారులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హాస్టల్లో వసతి పొందుతున్నారు. కానీ, అక్కడ కనీస వసతులు కొరవడి అష్టకష్టాలు పడుతున్నారు. అద్దె భవనాల్లో తలుపులు, కిటికీలు, దుప్పట్లు, వేడినీరు వంటి కనీస సౌకర్యాలు లేక చలి తీవ్రతకు వణుకుతున్నారు. దీనికి తోడు పారిశుధ్యలోపంతో అస్వస్థతకు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో 'ఆంధ్రజ్యోతి' బృందం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాస్టళ్లలో చేపట్టిన పరిశీలనలో వారి దుర్భర స్థితి మరోసారి వెలుగుచూసింది....

మహబూబ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. గతంలో లేనంతగా ఈదురుగాలులు వీస్తుండటంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. నవంబరు చివరి వారం నుంచే చలి తీవ్రత ఎక్కువ కాగా, జనవరి చివరి వరకు ఈ ప్రభావం కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ హాస్టళ్లు, కేజీబీవీలు, గురుకులాల్లో చలి తీవ్రత- విద్యార్థుల ఇబ్బందులు, ఇతరత్రా సౌకర్యాలపై ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. సరిపడా దుప్పట్లు చాలాచోట్ల పంపిణీ చేసినప్పటికీ, హాస్టళ్లలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు వణుకుతున్నారు. చాలా గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో గదులు సరిపోక, కిటికీలు, తలుపులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఉదయమే చన్నీటితోనే స్నానం చేయాల్సిన పరిస్థితితో తరచూ జలుబు, దగ్గుతో సతమతమవుతున్నారు. జలుబు అంటు వ్యాధి కావడంతో ఒకరికి వస్తే ఆ గదుల్లో ఉన్న మిగతావారికీ సోకుతోంది. కొన్నిచోట్ల గదులు సరిగా లేకపోవడంతో విద్యార్థులు భోజనశాలలోనే నిద్రిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. మరికొన్ని చోట్ల అనువైన భవనాలు లేకపోవడంతో షెడ్లలోనూ గురుకులాలను కొనసాగించాల్సిన దయనీయ పరిస్థితులు ఉన్నాయి. ఆయా జిల్లాల కలెక్టర్లు గురుకులాలకు ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ ఇంకా పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉందని విద్యార్థులు చెబుతున్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

అమలుకాని మెనూ.. పెట్టింది తిను..

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎనిమిది బీసీ, రెండు మైనారిటీ, రెండు ఎస్సీ, ఒక ఎస్టీ గురుకులాలు ఉన్నాయి. అయితే చాలావరకు గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీనివల్ల వేరే అవసరాల కోసం నిర్మించిన భవనాలు విద్యార్థులు వసతికి అనుగుణంగా లేవు. బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు సరిపడా లేకపోవడం, ఉన్నవి అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గురుకులాలకు కిటికీలు కూడా సక్రమంగా లేకపోవడంతో చలితీవ్రత ఎక్కువగా ఉంటోంది. వేడి నీళ్లు అందించే

(మిగతా 7లో..)

ఎద్దులేని ఎవుసం

కనుమరుగవుతున్న కాడెద్దులు

- పోషణ, కూలీల భారంతో యాంత్రీకరణ వైపు మొగ్గు
- విత్తు నుంచి కోత వరకు యంత్రాల వినియోగం
- రైతు ఆదాయం కంటే కూలి ఖర్చే అధికం


ట్రాక్టర్ సాయంతో కరిగెట చేస్తున్న రైతు

కాడెద్దులు కనుమరుగవుతున్నాయి. రైతుకు వ్యవసాయంలో తోడుగా ఉండే ఎద్దులు నేడు ఆధునిక వ్యవసాయంతో కనిపించకుండా పోతున్నాయి. వ్యవసాయంలో ఖర్చులు అధికమవడంతో పాటు సాగు చేసేందుకు భూములు కూడా తగ్గిపోయాయి. కొద్దిపాటి భూములు ఉన్న రైతులు ఎద్దులతో సాగు చేయాలంటే కుటుంబం గడవడం కష్టంగా మారింది. వ్యవసాయంతో పాటు ఇతర పనులు చేసుకుంటూ యంత్రాల సాయంతో సాగు చేస్తున్నారు. పెద్ద రైతులు కూడా ఎద్దులు ఉన్నా గడెం కొట్టేందుకు కూలీలు దొరకక పోవడంతో ఎద్దులను వదిలేసి యంత్రాలను వినియోగిస్తున్నారు. దుక్కుల నుంచి పంట చేతికొచ్చేదాకా ప్రతీ పనికి యంత్రాలు అందుబాటులో ఉండటంతో అందరూ వాటి వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో పశుసంపద కూడా క్రమేణా తగ్గిపోయింది.

- అలంపూర్ చౌరస్తా, ఆంధ్రజ్యోతి

నాలుగు జతల ఎద్దులు ఉండేవి



ఇటిక్యాల పాడు గ్రామ శివారులో మా కుటుంబానికి 100 ఎకరాల భూమి ఉండేది. నాలుగు జతల ఎద్దులు ఉండేవి. వాటికి ప్రత్యేకంగా షెడ్డు, సేద్యం చేసేందుకు ఆరుగురు పాలేర్లు ఉండేవారు. క్రమేణా పాలేర్లు పనికి రావడం మానేశారు. ఇప్పుడు రెండు ట్రాక్టర్లు పెట్టుకుని కౌలుతో పాటు 140 ఎకరాలు సాగు చేస్తున్నాను. మా ఊర్లో అప్పట్లో వంద జతల ఎద్దులు ఉండగా ఇప్పుడు 10 జతలు మాత్రమే ఉన్నాయి.

6

- ఎద్దుల రామచంద్రరెడ్డి, ఇటిక్యాలపాడు

డీఈవోగా రమేష్ కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాధికారిగా రమేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కలెక్టరేట్ లో కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశా రు. అనంతరం డీఈవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆయనను జిల్లా విద్యాశాఖ ఏసీ రాజశేఖర్‌రావు, పర్యవేక్షకులు నాగేందర్, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు, సెక్టోరియల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అదేవిధంగా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్, బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా కన్వీనర్ అరవింద్‌చారి డీఈవోను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అవుతున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఈవో రమేష్‌కుమార్

యువతను ప్రోత్సహించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రుణాల పంపిణీలో లక్ష్యం సాధించాలని, యువతను ప్రోత్సహించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లాలోని బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన గత జూన్, సెప్టెంబరు, త్రైమాసికంలో జిల్లా పనితీరును సమీక్షించడానికి సమావేశం నిర్వహించారు. 2024-25కు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి గురించి బ్యాంకుల వారీగా కలెక్టర్ బదావత్ సంతోష్ సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత యువతకు రుణాలు అందించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో ఆదనపు కలెక్టర్ దేవ సహాయం, డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేష్, డీపీవో రామ్మోహన్, ఎస్సీ సంక్షేమ అధికారి రాంలాల్, బీసీ సంక్షేమ అధికారి కాజా నజీమ్ ఆలీ, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, ఆయా బ్యాంకుల మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.


జూరాల కుడికాలువ

వారబందీ పద్ధతిలో నీటి విడుదల

యాసంగిలో 77వేల ఎకరాలకు సాగునీరు

ఇబ్బందులు లేకుండా సాగునీరందిస్తాం: ఎమ్మెల్యే

గద్వాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా వర్షాలు కురవడంతో వానాకాలం సాగు ఆశాజనకంగా సాగింది. ఇంకా ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు సమృద్ధిగా ఉండటంతో యాసంగి సాగుకు కూడా నీరందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్రస్థాయి సాగునీటి విడుదల ప్రణాళికా కమిటీ సమావేశమైంది. ఏయే ప్రాజెక్టులలో ఎంతమేరకు నీటి నిల్వలు ఉన్నాయో నివేదికలను పరిశీలించి ప్రాజెక్టుల వారీగా ఆయకట్టు సాగును నిర్ణయించింది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన జూరాల, నెట్టెంపాడు, ఆర్డీఎస్ కింద దాదాపు 77వేల ఎకరాలకు సాగునీటిని అందించాలని నిర్ణయించింది. ఇందులో జూరాల ప్రాజెక్టు కింద 34వేల ఎకరాలకు, నెట్టెంపాడు ప్రాజెక్టు కింద 24వేల ఎకరాలకు, గుడ్డెందొడ్డి రిజర్వాయర్ కింద 4,800 ఎకరాలు, ర్యాలంపాడు రిజర్వాయర్ కింద 19,200ఎకరాలకు, ఆర్డీఎస్ కాలువ కింద 37 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. తుంగభద్ర ప్రాజెక్టులో ప్రస్తుతం 92 టీఎంసీల నీటినిల్వ ఉంది. దామాషా పద్ధతి ప్రకారం ఆర్డీఎస్‌కు దాదాపు ఆరు టీఎంసీల నీళ్లు రావాల్సి ఉన్నా అందులో కొంత తగ్గిన 37 వేల ఎకరాలలో సాగునీరు అందించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రబీకి సాగునీటిని డిసెంబరు 25వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు వారబందీ పద్ధతిలో అందిస్తామని అధికారులు తెలిపారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిశాయి. రబీలో కూడా సాగునీరు అందిస్తున్నాం. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి. జూరాలకు వరద ఉండటంతో నెట్టెంపాడు కింద అన్ని రిజర్వాయర్లను నింపాము. అందుకే ఈ ఏడాది 24 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించాం. అందరు ఆరుతడి పంటలు వేసుకుంటే చివరలో నీటి ఇబ్బందులు ఉండవు.

- బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే

జిల్లా అభివృద్ధికి రూ.20 వేల కోట్లు

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కల్వకుర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడాదికి రూ.20వేల కోట్లు ఇవ్వడానికి సీఎం ముందుకు రావడం సంతోషంగా ఉందని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలు హాజరయ్యారు. చైర్మన్‌గా వావిళ్ల ఉమా మానీలా-సంజయాదవ్, వైస్ చైర్మన్‌గా పండిత్‌రావు, సభ్యులతో మార్కెట్ అధికారి స్వరణ్‌సింగ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి జూపల్లి మాట్లాడారు. 60ఏళ్ల తర్వాత సీఎంగా పాలమూరు బిడ్డకు అవకాశం వచ్చిందని, ఇది ఈ ప్రాంత ప్రజల అదృష్టమని అన్నారు. రైతులకు రుణమాఫీ చేయడంతోపాటు రైతు భరోసా ఇస్తామని తెలిపారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మార్కెట్ పాలకవర్గం నిజాయితీగా రైతులకు సేవలందించాలని సూచించారు.


మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు(కుడి నుంచి) కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్

కేఎల్ఐ, పీఆర్ఎల్ఐని పూర్తి చేసి జిల్లాలో 26 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని అందులో కల్వకుర్తి నియోజకవర్గానికి లక్ష 10 వేల ఎకరాలకు సాగునీరందనుందని తెలిపారు.

ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు నియోజ కవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ. 204 కోట్లు మంజూరు చేరని, పీఆర్ డిపార్ట్ మెంట్‌లో రోడ్ల అభివృద్ధికి రూ. 300 కోట్ల ప్రపోజల్స్ పంపించామని వాటికి నిధులు మంజూరు కానున్నాయని తెలిపారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ చెప్పిందే చేస్తుందని.. ఎవరూ కూడా అపోహ పడొద్దని తెలిపారు. బీ రామకృష్ణ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ సర్పంచ్‌లు ఆనంద్‌కుమార్, యెన్నం భూపతి రెడ్డి, నాయకులు షానవాజ్ ఖాన్, విజయ్‌కుమార్‌రెడ్డి, చిమ్ముల శీకాంత్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, పాల్గొన్నారు.

గాడి తప్పిన మునిసి'పాలన'

- ప్రజాపాలన విజయోత్సవ సభలో ఎమ్మెల్యే ఫొటో లేకపోవడంపై చెలరేగుతున్న వివాదం

నాగర్‌కర్నూల్ డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో పాలన గాడి తప్పుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపంతో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని పరిగణనలోకి తీసుకోకుండా తీసుకుంటున్న పలు నిర్ణయాలు దుమారం రేకెత్తిస్తున్నాయి. అవినీతి ఆరోపణలు, తమను పట్టించుకోవడం లేదని కౌన్సిలర్లు చేస్తున్న ఫిర్యాదుల మూలంగా మునిసిపాలిటీలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.

ఫ్లెక్సీల్లో ఎమ్మెల్యే ఫొటో లేక దుమారం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా పలు విభాగాల్లో వివిధ కార్యక్ర మాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికుల కోసం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే అక్కడి పరిస్థితిని చూసి అవాక్కయ్యారు. కార్యక్రమానికి సంబంధించి మునిసి పల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో లేదని ఆయన మండిపడ్డారు. కౌన్సిలర్లు కూడా కార్యక్రమ నిర్వహణకు సంబంధించి తమకు సమాచారం ఇవ్వలేదని దుయ్యబట్టారు. కౌన్సిలర్లుగా బాధ్యతల్లో ఉన్న తమకు అధికారుల నుంచి రెస్పాన్స్ రావడం లేదని, 18వ వార్డు కౌన్సిలర్ జక్కా రాజు ఆవేదన వ్యక్తం చేశారు. మరో కౌన్సిలర్ కావలి శ్రీను అధికారుల తీరును తప్పుపట్టారు. కౌన్సిలర్లను సమన్వయం చేసుకుని వారందరినీ ఆహ్వానించిన తర్వాత తనను పిలవాలని, అందుకు విరుద్ధంగా వ్యవహరించిన కమిషనర్ తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపాలిటీలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నందుకే ఉద్దేశపూర్వకంగా ఎమ్మెల్యేను విస్మరిస్తున్నారని కాంగ్రెస్ కౌన్సిలర్లు విమర్శి స్తున్నారు.


నాగర్‌కర్నూల్ మునిసిపల్ కార్యాలయం

అవినీతితో అభాసుపాలు..

మునిసిపాలిటీలో వివిధ అంశాల్లో చోటు చేసుకుంటున్న అవినీతి జనంలో అభాసుపాలు చేస్తోంది. అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాల విషయంలో దాదాపు కోటిన్నర రూపాయల అవినీతి తెలిసిందే. ఇందుకు సంబంధించి ఒక అధికారిని సస్పెండ్ చేశారు. కానీ సొమ్ము రికవరీ కాలేదు. సిబ్బందికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్‌ను ఇటీవల ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిలు ఇప్పించినప్పటికీ వాహనాల నిర్వహణ, డీజిల్, ఇతరత్రా విషయాల్లో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

- జెన్‌కో సేఫ్టీ డీఈ శ్రీకుమార్‌గౌడ్



పాతాళగంగ మత్స్యకారులతో మాట్లాడుతున్న డీఈ శ్రీకుమార్‌గౌడ్

దోమలపెంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రం నుంచి శ్రీశైలం డ్యాంలోకి నీటిని రివర్స్ బుల్ పంపింగ్ (నీటిని ఎత్తిపోసే ప్రక్రియ) చేసే సమయంలో మత్స్యకారులెవరూ చేపల వేటకు ఎగ్జిట్ టన్నెల్ వైపు వెళ్లొదని జెన్‌కో సేఫ్టీ డీఈ శ్రీకుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం కుడి, ఎడమ పాతాళగంగ మత్స్యకారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్ బ్యాక్ వాటర్‌నూ రివర్స్ బుల్ పంపింగ్ చేసే సమయంలో నీటిని జనరేటర్స్ వేగంగా లాగుకుంటాయని, దీంతో అటు వైపు మత్స్యకారులు, వలలు వేయడం, పడవలు తిప్పడం చేయకూడదన్నారు. కొద్ది రోజులు ట్రయల్ రన్ చేయడం జరుగుతున్నందున మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని డీఈ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సేఫ్టీ ఏడీఈ రాము, మురళీమోహన్, ఫైర్ ఆఫీసర్ మల్లికార్జున్, మత్స్యకారులు సంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు, జెన్‌కో అధికారులు ఉన్నారు.

చిరుత దాడిలో ఏడు గొర్రె పిల్లలు మృతి

కోయిలకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిరుత దాడిలో ఏడు గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని ఇబ్రహీంనగర్‌లో బుధవారం సాయంత్రం చోటుచేసుకొంది. గ్రామస్థుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇబ్రహీంనగర్‌కు చెందిన బొంగు కుశలయ్య గొర్రె పిల్లలను గ్రామ సమీపంలోని కొండ గట్టు వద్ద జాలిలో వేసి గొర్రెలను మేపడానికి వెళ్లాడు. వచ్చి చూసే సరికి జాలిలో ఉన్న ఆరు గొర్రె పిల్లలు రక్తపుమడుగులో మృతి చెంది ఉన్నాయి. ఒక గొర్రె పిల్లను చిరుత ఎత్తికెళ్లినట్లు సమీప పొలాల రైతులు తెలిపారు. వారం రోజులుగా ఖిల్లా సమీపంలో చిరుతలు కనిపించాయని గ్రామస్థులు తెలిపారు. బాధిత రైతును అటవీశాఖ అధికారులు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులు కోరారు.

భూసారం.. అవశ్యం

● భూసార పరీక్షలతోనే సమృద్ధి పంటలు
● ఉమ్మడి జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో నేల స్వభావం
● నేడు అంతర్జాతీయ మృత్తికా దినోత్సవం

జడ్చర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భూసారంతో సమృద్ధి పంటలు పండించుకోవచ్చు. భూమిలో సారం ఎంత ఉందో తెలుసుకోవాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి. ఈ పరీక్షలతో రైతులకు కలిగే ప్రయోజనాలను తెలిపేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం అంతర్జాతీయ మృత్తికా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భూసార పరీక్ష కేంద్రం ప్రధాన కేంద్రం జడ్చర్లలో ఉంది. కాగా, ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధమైన నేలలు ఉన్నాయి. ప్రధానంగా ఎర్రమట్టి నేలలు, నల్లమట్టి నేలలు (నల్లరేగడి), దుబ్బ, మిశ్రమ నేలలు, ఇసుక నేలలు, ఎర్రబంక నేలలు ఉన్నాయి.



జడ్చర్ల భూసార పరీక్ష కేంద్రంలో రైతులు తెచ్చిన మట్టికి పరీక్షలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

భూసార పరీక్షలను నిర్వహించుకుంటే రైతుకు ఎంతో ప్రయోజనాలున్నాయి. భూమిలో ఉన్న సారంతో పాటు పోషకాలు, లోపాలు తెలుస్తాయి. వీటితో పాటు నత్రజని, పొటాషియం, పాస్పరస్ ఎంత ఉందో తెలుస్తుంది. పంటలకు రసాయన ఎరువులను అధికంగా వినియోగిస్తుండటంతో ఏ మేరకు ఎంత వినియోగించుకోవాలో భూసార పరీక్షలతో వెల్లడి అవుతుంది. ప్రతీ రెండు, మూడు సంవత్సరాలకు ఒక పర్యాయం భూసార పరీక్షలు నిర్వహించుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలకు వ్యవసాయ పొలంలో సరాసరిగా మట్టిని సేకరించాల్సి ఉంటుంది. చెట్టునీడ, గట్టున్న స్థలం, పెంట కుప్పలు, నీరు నిల్వ ఉన్న స్థలం, ఎరువులు పోసిన స్థలంలో మట్టిని సేకరించవద్దు. ఒక ఎకరా పొలంలో 20 స్థలాల్లో మట్టిని సేకరించాలి. నాగలిలోతు 'వి' ఆకారం వచ్చేలా 15, 30 సెంటీమీటర్ల పొడువు, వెడల్పు గుంతలో మట్టిని సేకరించాలి. సేకరించిన మట్టిని నాలుగు భాగాలు కుప్పలు పోయాలి. అర కేజీ మట్టి వచ్చే వరకు ఎదురెదురుగా ఉన్న కుప్పలు తీసేయాలి. ఆ మట్టిని ఒక కవరులో పోసి, భూసార పరీక్ష కేంద్రంలో ఇవ్వాలి. ఆ మట్టికి భూసార పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడిస్తారు.



పరీక్ష కేంద్రానికి రైతు తీసుకువచ్చిన మట్టి

జిల్లా వారీగా..

● మహబూబ్‌నగర్ జిల్లాలో ఎర్రమట్టి నేలలు 67శాతం ఉండగా, నల్లమట్టి నేలలు 20 శాతం, దుబ్బ, మిశ్రమ నేలలు 13శాతం ఉన్నాయి. క్షారస్వభావం కలిగి ఉన్న ఈ నేలలో వరి, జొన్నలు, రాగులు, సజ్జలు, కందులు, మొక్కజొన్న, వేరుశనగ, మిరప, ఆముదం పంటలు పండిస్తారు.

● నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎర్రమట్టి నేలలు 62శాతం, ఇసుక నేలలు 29శాతం, నల్లమట్టి నేలల 9శాతం ఉండగా, తక్కువ నీటిని నిల్వ చేసుకునే విధంగా ఉన్నాయి. పత్తి, మొక్కజొన్న, వరి, వేరుశనగ పంటలు పండిస్తారు.

● వనపర్తి జిల్లాలో ఎర్ర నేలలు 47శాతం, మట్టినేలలు 42శాతం, నల్లమట్టి నేలలు 11శాతం ఉన్నాయి. వరి, వేరుశనగ, జొన్నలు, మొక్కజొన్న, కంది, పత్తి, ఆముదం పంటలు పండిస్తారు.

● జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎర్ర ఇసుక నేలలు 50శాతం, ఎర్రబంక నేలలు 30శాతం, నల్లమట్టి నేలలు 20శాతం ఉన్నాయి. వరి, జొన్నలు, పసుపు, మిర్చి, రాగులు, సజ్జలు, పత్తి, వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న, కందులు పంటలు పండిస్తారు.

● నారాయణపేట జిల్లాలో ఎర్ర ఇసుక నేలలు 53శాతం, ఇసుక నేలలు 32శాతం, నల్లమట్టి నేలలు 15శాతం ఉన్నాయి. వరి, జొన్నలు, పత్తి, పప్పుజాతి పంటలు, వేరుశనగ, ఆముదం, రాగులు, సజ్జలు, మొక్కజొన్న, కూరగాయలు పండిస్తారు.

భూసార పరీక్షలు చేయించాలి

ప్రతీ రెండు, మూడు సంవత్సరాలకు ఒక పర్యాయం తమ భూమికి సంబంధించిన మట్టికి భూసార పరీక్షలు చేయించాలి. దీంతో భూమిలో ఉన్న సారం ఎంతో తెలుస్తుంది. పోషకాలు, లోపాలు తెలుస్తాయి. ఏ ఏ ఎరువులను ఎంత మోతాదులో వినియోగించుకోవాలి భూసార పరీక్షలతో తెలుస్తుంది.

- గ్రేస్ ఎవాంజలిన్, ఏడీఏ, భూసార పరీక్ష కేంద్రం, జడ్చర్ల



పచ్చదనాన్ని కాపాడుకుంటేనే మానవ మనుగడ

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- మెడికల్ అంబులెన్సు ప్రారంభం
- అడవి మంటలను ఆర్పే బ్లోయర్లను అటవీ శాఖకు అందజేసిన ఐసీఐసీఐ ఫౌండేషన్

మన్ననూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం, అడవులు, వన్యప్రాణులను కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అమ్రాబాద్ మండ లం మన్ననూరు పర్యాటక వనమాలిక ఆవర ణలో అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అపోలో టోటల్ హెల్త్ సంస్థ వారు అడవిలో ఉండే చెంచులకు వైద్యశిబిరాలు నిర్వహించేందుకు మంజూరు చేసిన ఆరోగ్య అంబులెన్సును అటవీ అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.



మన్ననూరులో వన్యప్రాణి సంరక్షణ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఎఫ్‌డీ రాంబాబు, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

ఐసీఐసీఐ ఫౌండేషన్ వారు అటవీ శాఖకు అందించినటువంటి అడవిలో మంటలు ఆర్పే బ్లోయర్లను ఫైర్ వాచర్లకు అందజేశారు. ప్లాస్టిక్ నిషేధం చేసేందుకు పర్యావరణ హితమైన జనపనార సంచులు, మార్పటాకులతో విస్తరాకులను తయారు చేసే యంత్రాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలో 33శాతం పచ్చదనంతో కూడిన అడవులు ఉండాల్సిన అవసరం ఉందని, పచ్చదనం తగ్గి కాలుష్యం పెరిగితే ప్రపంచానికి రక్షణ కవచమైన ఓజోన్ పొర దెబ్బతింటుందని అన్నారు. పర్యావరణ సమతుల్యత లోపిస్తే వర్షపాత నమోదు శాతం తగ్గుతుందన్నారు. జిల్లాలో 39 శాతం అడవులున్నప్పటికీ ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అడవిలో మంటలు వ్యాపించకుండా స్థానికులు సిగరెట్ కాల్చడం, ఎక్కడపడితే అక్కడ మంటలు పెట్టడం మాని అడవుల సంరక్షణకు సహకరించాలన్నారు. దేశంలోనే రెండో అతి పెద్దదైన నల్లమలను సందర్శించేందుకు ఇష్టపడుతుంటారని, నల్లమలలో అటవీ నిబంధనలకు అనుగుణంగా ఉంటే పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. నల్లమలను టూరిజం హబ్‌గా మార్చి స్థానికులకు ఉపాధి కల్పించాలన్నదే తన ధ్యేయమన్నారు.

అటవీ క్షేత్ర సంచాలకులు(ఎఫ్‌డీ) రాంబాబు, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, ఎఫ్‌డీవో రామమూర్తి, రేంజ్ అధికారులు దేవజ, వీరేశం, గురుప్రసాద్, డీఆర్‌వో రవికుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రెండు రోజులుగా పస్తులు

- నిలిచిన మధ్యాహ్న భోజనం
- ఇంటి నుంచే అన్నం తెచ్చుకోమంటున్న హెచ్‌ఎం

దోమలపెంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రెండు రోజులుగా మధ్యాహ్నం భోజనం వండకపోవడంతో విద్యార్థులు పస్తులు ఉంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని దోమలపెంట ప్రభుత్వ ప్రాజెక్టు ఉన్నత పాఠశాలలో పాతాళగంగ , ఈగలపెంట, మత్స్యకారుల కాలనీ(ఇంక్లాండ్ టన్నెల్) దోమలపెంట గ్రామాలకు చెందిన 51 మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ 5 నుంచి 10 వరకు తరగతుల నిర్వహణ చేపడుతున్నారు. పేద విద్యార్థులకు ప్రతీ రోజు మధ్యాహ్న భోజనం పాఠశాలలో వండవల్సి ఉంది. అయితే గత రెండు రోజుల కిందట బియ్యం అయిపోయాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పట్టించుకోకపోవడం వల్లనే తమ పిల్లలు పస్తులు ఉండవల్సి వస్తున్నదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలకు బియ్యం వచ్చేవరకు విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. ప్రతీ నెల పాఠశాలకు రావల్సిన బియ్యం సక్రమంగా అందకపోవడం వల్లనే వంట చేయడం లేదని ఉపాధ్యాయ సిబ్బంది పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఒకపక్క ఆదేశాలు ఇస్తున్నప్పటికీ ఇక్కడ మాత్రం పరిస్థితి ఇలా ఉంది. దోమలపెంట పాఠశాలలో రెండు రోజులుగా మధ్యాహ్న భోజనం నిలిచిపోయినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ విషయంపై బుధవారం హెచ్‌ఎం నాగయ్యను వివరణ కోరగా, తమ పాఠశాలకు గత నెల రావాల్సిన బియ్యం అందకపోవడంతో మధ్యాహ్న భోజనం వండటంలేదని చెప్పారు. వచ్చే బియ్యం కూడా పురుగులు పట్టి ఉండటంతో తేలేదని, మంచి బియ్యం వచ్చే వరకు విద్యార్థులు తమ ఇంటి నుంచి భోజనం తెచ్చుకోక తప్పదని అన్నారు.



దోమలపెంట ప్రభుత్వ ప్రాజెక్టు ఉన్నత పాఠశాల

● సమస్యను తెలుసుకొని పరిష్కరిస్తాం

ప్రతీ రోజు పాఠశాలలో భోజనం వండేందుకు సరిపడ బియ్యం ఉంచుకోవాలి. దోమలపెంట పాఠశాలలో విద్యార్థులు పస్తులు ఉంటున్న విషయం తెలువదు. స్థానిక అధికారుల నుంచి సమాచారం తెలుసుకొని సమస్య పరిష్కరిస్తా.

- రమేష్ కుమార్, డీఈవో నాగర్‌కర్నూల్

ఎద్దులేని ఎవుసం



క్యాతూరు గ్రామంలో కందిలో అంతరపంటగా వేసిన మొక్కజొన్న పంటను హార్వేస్టరుతో సేకరిస్తున్న దృశ్యం

అలంపూర్ చౌరస్తా, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు ఎద్దులను తమ కుటుంబ సభ్యుల్లో ఒకరిగా చూసుకుంటూ పోషించేవారు. ప్రతీ రైతు ఇంట్లో కనీసం ఒక జత, కాస్త పెద్ద రైతుల ఇళ్లల్లో రెండు నుంచి పదులసంఖ్యలో ఎద్దులు ఉండేవి. తమ తమ పిల్లలు వ్యవసాయం నుంచి దూరం కావ డంతో పాటు పోషణభారంతో ఎద్దులతో పాటు పశుసంపద కూడా క్రమేణా తగ్గిపోయింది. దీంతో రైతు జీవితంలో భాగమైన ఎద్దు మాయమవుతున్నది.

ఎద్దుల స్థానాన్ని ట్రాక్టర్లు ఆక్రమించి అంతకుమించి పని చేస్తున్నాయి. ఒక ఎకరం పొలం గంటలో దున్నడం, పెల్లలు కరిగేందుకు వర్షంకోసం ఎదురు చూడాల్సిన పని లేకుండా రోటావేటర్‌తో నూర్పిడి చేయడంతో సేద్యం పూర్తవుతుంది. ఇక విత్తనం వేయాలంటే మనుషుల సాయం లేకుండానే ట్రాక్టర్లతో పాటు నడిచే విత్తన పరికరాలను ఉపయోగిస్తున్నారు. కలుపు తక్కువ ఉంటే మనుషులను మించిపోతే పంటనుబట్టి సాళ్లమధ్య పిచికారి చేస్తే గడ్డి పూర్తిగా అంతమయ్యే మందులు అందుబాటులోకి రానే వచ్చాయి. ఇక మందుల పిచికారికి కూడా ట్రాక్టర్లనే ఉపయోగిస్తున్నారు. వైపర్ల సాయంతో పంటల్లో విస్తరంగా వెదజల్లడమే గాక నిమిషాల్లో పూర్తవుతుంది. ఇంకా ఆధునికంగా డ్రోన్‌ల సాయంతో మందులు పిచికారి చేస్తున్నారు. దీని వల్ల పంటకు నష్టం జరగకపోవడమేగాక, క్రిమిసంహారక మందుల మోతాదు తగ్గడం వల్ల రైతుకు డబ్బు ఆదా అవుతుందని డ్రోన్ మల్లెందొడ్డి గ్రామానికి చెందిన పైలట్ పరశురామ్ తెలిపారు.

మాయమవుతున్న ఎద్దులు

రైతులు యాంత్రీకరణ వైపు అడుగులు వేయడంతో పూర్వం నుంచి రైతులకు తోడుగా ఉన్న ఎద్దులు కాలక్రమేణా మాయమవుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణాలు పోషణభారం. ఒకప్పుడు ధాన్యపుగింజలు పండించడంతో నూర్పిడి పట్టాకా మిగిలినది మేతకు వాడుకునేవారు. క్రమేణా కమర్షియల్ పంటలు సాగు చేస్తుండటం వల్ల పశువుల మేత కొనాల్సివస్తుంది. ప్రస్తుతం ఒక ట్రాక్టర్ వరిగడ్డి ధర రూ.14వేల నుంచి రూ.16వేలు పలుకుతుంది. ఒక జత ఎద్దులకు ఏడాదికి కనీసం రెండు ట్రిప్పులు గడ్డి అవసరం. దీనికి తోడు దాణా ఖర్చుతో పాటు, శీతాకాలంలో పచ్చిగడ్డి కోసుకొస్తూ వాటి సపర్యాలు కూడా చేయాలి. వేసవి దుక్కులంతా ట్రాక్టర్లతో చేయడం వల్ల ఏడాదిలో 8నెలలు ఎద్దులు ఖాళీగా ఉంటాయి కాబట్టి వీటికోసం ఇంట్లో ఒకరు ఇంటివద్దే ఉండాల్సిరావడం... మిర్చి, వేరుశనగ, పప్పుశనగ, మొక్కజొన్న తదితర కొన్ని రకాల పంటలకు మాత్రమే అంతర సేద్యానికి ఎద్దులు ఉపయోగిస్తున్నారు. దీంతో నానాటికి ఎద్దుల సంఖ్య తగ్గుతూ యంత్రాల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. ఉమ్మడి జిల్లాలో 2015లో దుక్కికి పనికివచ్చే ఎద్దులు 35,142 ఎద్దులు ఉండగా.. ప్రస్తుతం 16,885 మాత్రమే ఉన్నాయి. 2015లో వ్యవసాయ ట్రాక్టర్లు 13,680ఉండగా ప్రస్తుతం 31,583గా ఉన్నాయి. ఇక హార్వేస్టర్లు ప్రస్తుతం 2394 ఉండగా ఇక ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగుభూమి 18లక్షల 26వేల 4ఎకరాలు ఉంది. భవిష్యత్‌లో వ్యవసాయ రంగంలో మరిన్ని కొత్తతరహా యంత్రాలు వచ్చే అవకాశం లేకపోలేదు.

కూలీలను కట్టిపడేసిన నగదు పథకాలు

ముఖ్యంగా కూలీల కొరతకు ప్రభుత్వాలు ఇచ్చే నగదు పథకాలతో కాలంవెళ్లదీసే వారి సంఖ్య పెరిగిపోవడమూ ఓ కారణమే. దీనివల్ల రోజువారి కూలీల సంఖ్య బాగా తగ్గిపోయిందనడంలో సందేహం లేదు. చిన్న చిన్న పనులకు మినహా మిగతా పనులకు యంత్రాలను వాడుతూ ఖర్చు, సమయాన్ని ఆదా చేసుకుంటున్నారు. వ్యవసాయ పనులు చాలా చోట్ల ఒకేసమయంలో ప్రారంభం కావడంచేత కూలీల కొరత ఏర్పడుతుంది. దీంతో ఒక్కో మహిళ కూలీ ధర రోజుకు రూ.200 నుంచి రూ.500వరకు పెరిగింది. పురుషుల కూలీలు రూ.400నుంచి రూ.700కు పెరిగింది. దీంతో రైతుకు ఆదాయం కంటే కూలీల ఖర్చే ఎక్కువ అవుతుంది.

ఎద్దులతో అంతర సేద్యానికి భలే డిమాండ్

క్రమేణా ఎద్దుల సంఖ్య తగ్గినా సరైన సమయంలో అంతర సేద్యాలు ఎద్దులతోనే చేయాలి. సరిగ్గా దీనినే కొంతమంది చిన్నకారు వ్యవసాయకూలీ రైతులు ఉపాధిమార్గంగా మలుచుకుంటున్నారు. పంటచేతికొచ్చే క్రమంలో ట్రాక్టరుతో సేద్యం చేస్తే పంటదెబ్బతినే అవకాశం ఉంటుంది కాబట్టి ఎద్దులతో అయితేనే సౌకర్యంగా ఉంటుంది.

ఆగస్టు నుంచి నవంబరు వరకు ఎద్దులకు భలే డిమాండ్ ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని సీజన్‌కుముందు ఎద్దులను కొని అంతసేద్యానికి ఎకరాకు రూ.ఐదు వందల నుంచి రూ.ఏడు వందల వరకు తీసుకుంటారు.

ఇలా రోజూ ఐదు నుంచి ఎనిమిది ఎకరాల వరకు సేద్యం చేస్తారు. సీజన్ పూర్తికాగానే మళ్లీ అమ్మేయడం పరిపాటిగా మారింది.

ఈ చిత్రంలో కనిపిస్తున్న యంత్రం మాన్యువల్ సీడర్. దీని ధర రూ. ఆరు వేలు. ఈ యంత్రంతో పత్తి, మొక్కజొన్న, కంది, వేరుశనగ, పప్పుశనగ, సోయాబిన్, మినుముల విత్తనాలు విత్తవచ్చు. ఒక వ్యక్తి రోజుకు మూడెకరాలు విత్తనం వేయవచ్చు. అదే కూలీలతో విత్తితే ఎకరానికి రూ.2వేలు అవుతుంది. మూడెకరాల కూలీల ఖర్చుతో యంత్రమే వస్తుంది. ప్రతి ఏటా విత్తుకోవచ్చని రైతు గురుప్రసాద్ తెలిపారు.





కూలీల ఖర్చును భరించలేక సొంతంగా కలుపుతీసే యంత్రాన్ని చేసుకుని సేద్యం చేసుకుంటున్న రైతు (ఫైల్)

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

● అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఏకే జిలానీ



సమావేశంలో మాట్లాడుతున్న జిలానీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అవినీతిరహిత సమాజాన్ని నిర్మిద్దామని అందుకు ప్రతీ ఒక్కరు తమవంతుగా ముందుకు రావాలని అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఏకే జిలానీ అన్నారు. అవినీతిరహిత దినోత్సవాన్ని పురస్కనరించుకొని బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో అవినీతి ప్రజాస్వామ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను ఎలా బలహీన పరుస్తుందన్న అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఏకే జిలానీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి అవినీతి సమాజాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఏ విధంగా బలహీన పరుస్తోంది తెలుసుకొని... అవినీతి లేని సమాజాన్ని నిర్మించడానికి ప్రయత్నం చేయాలన్నారు. ఏవరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు లంచం అడిగితే నిర్భయంగా అవినీతి నిరోధక శాఖను సంప్రదించాలన్నారు. టోల్ ఫ్రీ నెంబరు 1064కు ఫోన్ చేయాలన్నారు. అవినీతి నిరోధక వారోత్సవాలు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ అధికారులు లింగస్వామి, సీఎంవో బైకాని బాలు యాదవ్, విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ శంభూప్రసాద్, ఎంఈవో లక్ష్మణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం విజేతలుగా నిలిచిన తెలుగు మీడియంలో వి.ఈశ్వర్ (షాషాబ్ గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల), ఎన్.శుదీక్ష (శిశు వికాస్‌గ్రామర్ స్కూల్), ఇంగ్లీస్ మీడియంలో అనీఖా ఐమాన్ ప్రతిభ ఉన్నత పాఠశాల, నిహారిక (శ్రీఅక్షర ఉన్నత పాఠశాల), సాహితి (లిటిల్ స్కాలర్స్ హైస్కూల్), ఉర్దూ మీడియం విభాగంలో సమ్రీన్ బేగం (మదీనా మజీద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల), మదీనా తబసుం ప్రభుత్వ పోలీస్ లైన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు గెలుపొందారు. వీరికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

గొంతు కోసుకొని మహిళ ఆత్మహత్య

మహమ్మదాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈలపీటతో గొంతు కోసుకొని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈలపీటతో గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో నివసిస్తున్న పుష్పమ్మ కుటుంబ కలహాలు భరించలేక ఈలపీటతో గొంతు కోసుకొన్నది. గమనించిన భర్త రాములు ఆమెను మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలో మృతి చెందింది. ఈ మేరకు కొత్తపల్లి మండలం గొకులారం గ్రామానికి చెందిన మృతురాలి తల్లి బొంత సాయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుల ఎన్నిక

● ఎన్నికల ఫలితాల ఆధారంగా జిల్లాల కమిటీల నియామకం

మహబూబ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. రెండు నెలల క్రితం అన్ని జిల్లాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, జనరల్ సెక్రెటరీలకు ఆన్‌లైన్‌లో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలు పూర్తై ఫలితాలు వెలువడ్డాయి. వీటిని యూత్ కాంగ్రెస్ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఎక్కువ ఓట్లు వచ్చిన వారిని అధ్యక్షులుగా రెండోస్థానంలో ఉన్నవారిని ఉపాధ్యక్షులుగా నియమించారు. ఇలా ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాలకు సంబంధించిన అధ్యక్షుల నియామకాలు పూర్తయ్యాయి. వారికి వచ్చిన ఓట్ల ఫలితాలను కూడా వెల్లడించారు. కొన్ని చోట్ల ఇద్దరి మధ్య అధ్యక్ష స్థానానికి తీవ్ర పోటీ జరగగా, మరికొన్ని చోట్ల ముగ్గురు పోటీ పడ్డారు. మహబూబ్‌నగర్‌లో ఆరుగురు, వనపర్తిలో తొమ్మిదిమంది, నారాయపేటలో ఐదుగురు, నాగర్‌కర్నూల్‌లో ఎనిమిది మంది, గద్వాలలో ఐదురుగురు పోటీ పడ్డారు.

● మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఉన్న ఆవేజ్ అహ్మద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇక్కడ మొత్తం 24,772 ఓట్లు పోలవగా అందులో అవేజ్ 9621 ఓట్లు సాధించి అధ్యక్షుడిగా ఎన్నికవగా, మహేశ్‌కుమార్ 6083 ఓట్లతో ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు.

● నాగర్‌కర్నూల్ జిల్లాలో 12392 ఓట్లు పోలవగా అందులో కొత్తపల్లి వినోద్‌కుమార్‌కు అత్యధికంగా 6896 ఓట్లు రాగా ఆయన అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 4690 ఓట్లతో రాజేశ్ ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు.

● వనపర్తి జిల్లాలో 14136 ఓట్లు పోలవగా ఆదిత్య 8212 ఓట్లు సాధించి అధ్యక్షుడిగా ఎన్నికవగా, 4227 ఓట్లతో దివాకర్ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు.

● జోగుళాంబ గద్వాల జిల్లాలో 13482 ఓట్లు పోల్ అవగా అందులో రంగన్నగారి తిరుమలేష్ 8941 ఓట్లు సాధించి అధ్యక్షుడిగా ఎన్నికవగా, 4406 ఓట్లతో చిట్టెం పురుషోత్తంరెడ్డి ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు.

● నారాయణపేటలో 9775 ఓట్లు పోలవగా అందులో కొత్త మధుసూదన్‌రెడ్డి 5511 ఓట్లు సాధించి యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులు కాగా, 3841 ఓట్లతో మనోజ్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

క్రైం కార్నర్

విగ్రహ ధ్వంసం నిందితుల అరెస్ట్

▸ విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్, చిత్రంలో సీఐ మహేశ్, ఎస్ఐ గోకారి

కోడేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పురాతన గణపతి విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం కోడేరు పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలోని ఉమా మహేశ్వర ఆలయం సమీపంలో ఉన్న పురాతన గణపతి విగ్రహాన్ని గత నెల 26న గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం ధ్వంసం చేశారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులు కర్ణాటక రాష్ట్రానికి చెందిన మహబూబ్‌పాషా, హుస్సేన్‌బాషా, ఉస్మాన్‌లుగా గుర్తించారు. వారిలో మహబూబ్‌బాషా, హుస్సేన్‌బాషాలను విచారించగా నేరం ఒప్పుకున్నారని, ఉస్మాన్ పరారీ లో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. విగ్రహం ధ్వంసం చేసేందుకు వినియో గించిన సుత్తులు, ఇతర పరికరాలు, వారు వాడిన తుఫాన్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పరచి, న్యాయాధికారి ఆదేశం మేరకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ మహేశ్, ఎస్ఐ గోకారి పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

▸ రూ. 2.60 లక్షల విలువైన రాగి తీగ చోరీ

వంగూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలం, సర్వారెడ్డిపల్లి తండా గేటు సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి రాగి తీగను ఎత్తుకెళ్లారు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సర్వారెడ్డిపల్లి తండా గేటు సమీపంలోని భగీరథ ఫెర్టిలైజర్ కంపెనీకి చెందిన ట్రాన్స్‌పార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి ధ్వంసం చేశారు. అందులోని రూ. 2.60 లక్షల విలువైన రాగి తీగను ఎత్తుకెళ్లారు. సంఘటనపై బాధితుడు నరేశ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ మహేందర్ గురువారం సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యం భరించలేక వ్యక్తి ఆత్మహత్య

మహమ్మదాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఒక వైపు వేధిస్తున్న అనారోగ్యం, మరో వైపు ఇటీవల తల్లి మృతి చెందడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నంచర్ల గ్రామానికి చెందిన బంటు హన్మంతు (34) కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల ఆయన తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆయన మంగళవారం పొలం వద్దకు వెళ్లి గుర్తుతెలియని మందు తాగి స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబసభ్యులు గమనించి, మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరుడు బంటు మారుతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రీడల్లో రాణించి.. కొలువు సాధించి...



▸ ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన ఉమ్మడి పాలమూరు యువకులు ▸ స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాల సాధన

“ చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలి. ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగితే భవిష్యత్తు బంగారం అవుతుంది. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చు' అని సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు పదే పదే చెప్తూ ఉంటారు. అది ముమ్మాటికీ వాస్తవమని ఉమ్మడి పాలమూరు జిల్లా క్రీడాకారులు నిరూపించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి ఆటల పోటీల్లో రాణించిన పలువురు యువకులు క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం లభించడంతో పాటు అద్భుతమైన భవిష్యత్తు కూడా సిద్ధిస్తుందని ఉమ్మడి పాలమూరు జిల్లా యువకులు నిరూపించారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు అభ్యర్థులను మెరిట్ ప్రకారం ఎంపిక చేస్తారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన వారికి మొదటి ప్రాధాన్యం, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించిన వారికి ద్వితీయ ప్రాధాన్యం ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన వారికి ఆ తర్వాత ప్రాధాన్యం ఇస్తారు. ఒక వేళ ఇద్దరికి ఒకే మెరిట్ ఉంటే వయసును పరిగణనలోకి తీసుకుంటారు. ఇలా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన కొందరు క్రీడాకారులను ఇటీవల 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. ఆ వివరాలిలా ఉన్నాయి.

పోలీసు కానిస్టేబుల్‌గా..

మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలం, తాటిపర్తి గ్రామానికి చెందిన మహమ్మద్ జలాలొద్దీన్, ఖాజాబేగం దంపతులు మహబూబ్‌నగర్ పట్టణంలోని బీకేరెడ్డి కాలనీలో నివసిస్తున్నారు. వారి కుమారుడు మహ్మద్ సమీరుద్దీన్ భగీరథ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్నాడు. అప్పుడు పీఈటీ జీయివుద్దీన్ సహకారంతో హ్యాండ్‌బాల్ క్రీడలోకి ప్రవేశించాడు. కోచ్ అహ్మద్‌హుస్సేన్ ఆధ్వర్యంలో శిక్షణ పొంది, చదువుతో పాటు, హ్యాండ్‌బాల్ క్రీడలో రాణించాడు. సీనియర్, జూనియర్, ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. 15 రాష్ట్ర స్థాయి, రెండు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో పాల్గొన్నాడు. క్రీడా కోటాలో పోలీసు ఉద్యోగం సాధించాడు. 2024 వరంగల్ జిల్లా మడికొండ సిటీ పోలీస్ శిక్షణ కళాశాలలో సివిల్ కానిస్టేబుల్‌గా తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకున్నాడు.



తల్లిదండ్రులు మహమ్మద్ జలాలొద్దీన్, ఖాజాబేగంలతో మహమ్మద్ సమీరుద్దీన్,



పోలీసు ఉద్యోగానికి ఎంపిక

శివకుమార్‌ది మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలం. కొండాపూర్ గ్రామం. తల్లిదండ్రులు కృష్ణయ్య, సువర్ణ. కృష్ణయ్య వ్యవసాయంతో పాటు, ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుమారుడిని చదివించాడు. మామ, బాబాయ్‌లు వాలీబాల్ క్రీడాకారులు కావటంతో తాను కూడా అదే దారిలో ముందుకు సాగాడు. సౌత్ సెంట్రల్ రైల్వే క్రీడాకారుడు మహ్మద్ అజార్‌అలీ అతడికి ప్రోత్సాహం అందించాడు. జిల్లా కేంద్రంలోని అపెక్స్ సెంట్రల్ స్కూల్, వాగ్దేవి జూనియర్ కళాశాల, ఎంవీఎస్ డిగ్రీ కళాశాలల్లో విద్యాభ్యాసం పూర్తి చేశాడు. ఎనిమిది సార్లు రాష్ట్ర స్థాయి, మూడు సార్లు జాతీయస్థాయి టోర్నీల్లో పాల్గొన్నాడు. 2022లో ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అలాగే క్రీడా కోటాలో పోలీసు ఉద్యోగం కూడా సాధించాడు. ఇష్టంతో ఆడిన వాలీబాల్ ఈ రోజు నాకు ఉద్యోగాన్ని సాధించి పెట్టిందని శివకుమార్ తెలిపారు. 2024 వరంగల్ జిల్లా మడికొండ సిటీ పోలీస్ శిక్షణ కళాశాలలో సివిల్ కానిస్టేబుల్‌గా తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకున్నాడు.



కానిస్టేబుల్ శిక్షణ పూర్తి చేసుకున్న వాలీబాల్ క్రీడాకారుడు శివకుమార్

ఆఫీస్ సూపరింటెండెంట్‌గా..

కిష్టయ్య తిరుమణిది నాగర్‌కర్నూల్ జిల్లా. తల్లిదండ్రులు వెంకటయ్య, మల్లమ్మ. కల్వకుర్తి మండలం, ఊర్కొండ పేట గ్రామం. ఉర్కొండ పేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎనిమిదవ తరగతి వరకు చదు వుకున్నాడు. మెదక్‌లోని సాయ్ హాస్టల్‌లో సీటు సాధించి 9వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యను పూర్తి చేశాడు. వ్యాయామ ఉపాధ్యాయులు బాల్ రాజ్, యాదయ్య సహకారంతో క్రీడల్లో చేరాడు. 20పై జాతీయస్థాయి అథ్లెటిక్స్ టోర్నీ పాల్గొన్నాడు. 2015 క్రీడా కోటాలో ఆదాయ పన్నుల శాఖలో ఆఫీస్ సూపరింటెండెంట్ ఉద్యోగం సాధించాడు. హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు.



ఆదాయపన్నుల శాఖలో ఉద్యోగం సాధించిన క్రిష్టయ్య తిరుమణి



రవికుమార్‌ను సన్మానిస్తున్న లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ నాగురావు నామాజీ(ఫైల్)

ఆదాయ పన్నుల శాఖలో ..

రవికుమార్‌ది నారాయణపేట జిల్లా, దామరగిద్ద గ్రామం. తల్లిదండ్రులు నర్సింహులు, విజయలక్ష్మి. రవికుమార్ ప్రాథమిక, ఉన్నత, ఇంటర్మీడియట్ వరకు గ్రామంలోనే చదువుకున్నాడు. ఆ తర్వాత నిజాం కాలేజీలో డిగ్రీ, ఎంపీఈడీ పూర్తి చేశాడు. పాఠశాల స్థాయిలో పీడీ రమణ ప్రోత్సాహంతో అథ్లెటిక్స్‌లో రాణించాడు. మహబూబ్‌నగర్ స్టేడియంలో శిక్షణ పొంది అథ్లెటిక్ కోచ్‌లు ఆనంద్, సునీల్ సహకరంతో సాయి స్పోర్ట్స్ హాస్టల్‌లో సీటు సాధించాడు. అక్కడ ద్రోణాచార్య పురస్కార గ్రహీత నాగపూరి రమేష్ ఆధ్వర్యంలో శిక్షణ పొందాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభను చాటి పతకాలు సాధించాడు. 20కి పైగా జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొన్నాడు. 2023లో క్రీడా కోటాలో కొలువు సాధించాడు. బెంగళూరు, ఆదాయ పన్నుల శాఖలో విధులు నిర్వర్తిస్తున్నాడు.

ఆర్మీ ఉద్యోగం సాధించి దేశ సేవలో..

జిల్లా కేంద్రంలోని టీటీగుట్టకు చెందిన చంద్రశేఖర్. తల్లిదండ్రులు పోషన్న, భీమమ్మ. టీడి గుట్ట హై స్కూల్ లో చంద్రశేఖర్ ఎనిమిదవ తరగతి వరకు చదివాడు. మెదక్ సాయ్ హాస్టల్ సీటు సాధించి ఇంటర్ వరకు విద్యను అభ్యసించారు. 10కి పైగా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. అన్న, తమ్ముడు క్రీడాకారులు కావటంతో, వారి స్పూర్తితో తానూ క్రీడల్లో రాణించాడు. స్టేడియంలో కోచ్‌లు సునీల్, ఆనంద్ వద్ద అథ్లెటిక్స్ శిక్షణ పొందాడు. 21 ఏళ్ల వయస్సులో క్రీడా కోటాలో, ఆర్మీ ఉద్యోగం సాధించి, దేశ సేవ చేస్తున్నాడు.



ఆర్మీ ఉద్యోగం సాధించిన జి.చంద్రశేఖర్

జాతీయ స్థాయి పోటీలకు గిరిజన విద్యార్థి



బాబూనాయక్

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూ ల్ జిల్లా, అచ్చంపేట మండలం, దేవులాతండాకు చెందిన బాబూనాయక్ బాల్ బాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. హన్మకొండ జిల్లా కేంద్రంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గత నెల ఎనిమిది, తొమ్మిది, 10 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆయన ప్రతిభతో రాణించారు. కర్ణాటక రాష్ట్రంలోని కొడగు జిల్లా, కుశాల్‌నగర్‌లో ఈ నెల ఆరు నుంచి ఎనిమిది వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి బాల్ బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనను న్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయనను తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

అలంపూర్ ఆలయాల అభివృద్ధికి కృషి

▸ విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి

అలంపూర్ చౌరస్తా, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అలంపూర్ క్షేత్రంలోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. పాలక మండలి సభ్యులతో కలిసి బుధవారం ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆలయ పవిత్రతను కపాడుతునే ఆదాయ వనరులు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఫోర్డింగ్‌లు ఏర్పాటు చేసి భక్తుల సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం, లాకర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్వామి, అమ్మ వార్ల ఆలయాలకు ప్రతీ సంవత్సరం ఆదాయం పెరుగుతోందన్నారు. టెండర్ల ద్వారా గతంలో రూ. 1.80 కోట్ల ఆదాయం వచ్చేదని, ఈ ఏడాది రూ. 3.48 కోట్లు వచ్చాయని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మపై ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో నమోదైన కేసు పూర్తిగా ఆయన వ్యక్తిగతమని స్పష్టం చేశారు. ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉందన్నారు. ఈ విషయంపై కొందరు వేర్వేరు చోట్ల ఫిర్యాదులు చేస్తూ ఆలయ విశిష్ఠతను దెబ్బతిస్తున్నారని తెలిపారు. ఎవరు తప్పు చేసినా క్షేమించేది లేదని, అందులో ఇతరుల జోగ్యం అనవసరమని స్పష్టం చేశారు. ఆనంద్ శర్మ విషయంపై నాలుగు రోజుల క్రితం ఎన్‌డోమెంట్ కమిషనర్‌కు నివేదికను పంపించినట్లు తెలిపారు. సమావేశంలో పాలక మండలి సభ్యులు ప్రాగటూరు గోపాల్, జగన్ మోహన్ నాయుడు, నాగశిరోమణి, జగన్‌గౌడ్, సరస్వతి, పులేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొంకల నాగేశ్వర్‌రెడ్డి, చిత్రంలో నాగశిరోమణి, వెంకటేశ్వర్లు

సంక్షేమం వణుకు

(మొదటి పేజీ తరువాయి)

వసతి ఈ జిల్లాలోని ఏ గురుకులంలోనూ లేదు. భోజనం కూడా మెనూ ప్రకారం పెట్టక పోగా నాణ్యంగా ఉండటం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ప్రస్తుతం మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షిస్తుండటంతో పరిస్థితి కొంత మెరుగైనప్పటికీ ఇంకా పర్యవేక్షణ పెంచి వసతులు కల్పించాల్సి ఉంది.

నీటి కొరత, విషసర్పాల సంచారం

వనపర్తి జిల్లాలోని గురుకులాల్లో వసతి పొందుతున్న విద్యార్థులు చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్దమందడి మండల కేంద్రంలో ఉన్న బీసీ వసతిగృహానికి తలుపులు, కిటికీలు లేవు. రాత్రి వేళలో చల్లటిగాలి వీస్తుండటంతో సతమతమవుతున్నారు. అమరచింత ఎస్సీ బాలుర వసతిగృహం తండా సమీపంలో ఉంటుంది. ఈ హాస్టల్‌లో ఐదు గదుల్లో 120 మంది విద్యార్థులు ఉంటారు. వసతిగృహానికి ప్రహరీ లేదు. తరచూ విషసర్పాలు వస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. ఇక్కడ మంచినీటి బోరు చెడిపోవడంతో ఐదు నెలలుగా పట్టించుకోవడం లేదు. తాత్కాలికంగా మిషన్ భగీరథ ద్వారా నీరందిస్తున్నారు. మదనాపూర్ ఎస్సీ గురుకులంలో పాఠశాల ఆవరణ మొత్తం పిచ్చిమొక్కలతో ఉన్నది. సరిపడా దుప్పట్లు ఉన్నప్పటికీ చన్నీటి స్నానంతో ఇబ్బందులు పడుతున్నారు. పెబ్బేరు మండల కేంద్రంలోని సావిత్రీబాయి పూలే బాలికల వసతి గృహంలో 470 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రైవేటు భవనంలో కొనసాగుతుండటంతో సౌకర్యాలు సరిగా లేవని విద్యార్థులు చెబుతున్నారు. ఆత్మకూరు మండలంలో బీసీ, ఎస్సీ ఎస్టీ బాలికల వసతి గృహాలు ఉన్నాయి. బీసీ వసతి భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రైవేటు భవనంలో వసతి ఏర్పాటు చేశారు. ఈ మూడు వసతి గృహాల్లో చన్నీటి స్నానంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

బెడ్‌షీట్లు కొరత.. జర్కిన్లతో ఊరట

నారాయణపేట జిల్లావ్యాప్తంగా ఆరు ఎస్సీ గురుకులాలు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో బెడ్‌షీట్లు ఇంకా అందలేదు. ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టామని, త్వరలో వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దుప్పట్లు, ట్రంక్ పెట్టెలు కావాల్సినన్ని ఇచ్చారు. నారాయణపేట మండలం సింగారం చౌరస్తాలోని బాలుర గురుకులంలో దుప్పట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. కిటికీలు ధ్వంసం కావడం, బాత్రూమ్‌లకు తలుపులు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. ప్రధాన గేటు కూడా లేకపోవడంతో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. చలికి తట్టుకోలేక ఇళ్ల నుంచి జర్కిన్లు తెప్పించుకుంటున్నారు. రెండు మైనారిటీ గురుకులాలు ఉండగా అవి అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. జిల్లాలో నాలుగు మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాలు ఉండగా అవి కూడా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

దోమల మోత, అపరిశుభ్రత

మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 24 వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో 15 బీసీ, 8 ఎస్టీ హాస్టళ్లు ఉండగా కొన్ని వసతిగృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో అక్కడ సౌకర్యాలు సరిగా లేవు. రాజాపూర్ కేజీబీవీలోని రెండో అంతస్తులో కిటికీలు పూర్తిగా లేకపోవడంతో విద్యార్థులు రాత్రివేళ భోజనశాలలో పడుకుంటున్నారు. కిచెన్ షెడ్లు లేకపోవడం, బియ్యంలో పురుగులు వస్తుండటంతో నిత్యకృత్యంగా మారింది. అలాగే బాత్‌రూంలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. చాలా చోట్ల స్కావెంజర్లు లేకపోవడంతో మరుగుదొడ్లు దుర్గంధంగా తయారయ్యాయి. మూసాపేట ఎస్సీ వసతిగృహంలో గదులు శిథిలావస్థకు చేరాయి. బాత్‌రూమ్‌లు కూడా పాడయ్యాయి. చాలా హాస్టళ్లలో భోజనం నాణ్యంగా ఉండటం లేదని విద్యార్థులు చెబుతున్నారు. బాలానగర్ ఎస్సీ గురుకులంలో బాత్‌రూమ్‌లు శుభ్రం చేయడానికి స్కావెంజర్లు లేక అపరిశుభ్రంగా ఉన్నాయి. జడ్చర్ల పట్టణంలో ఐదు, మల్లెబోయిన్‌పల్లి సమీపంలో మూడు గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఉర్కొండపేట, బాలానగర్, నవాబ్‌పేట మండలాల గురుకుల పాఠశాలలు కూడా కొనసాగుతున్నాయి. కొన్ని వసతిగృహాలకు కిటికీలు, మెష్‌లు లేవు. దీంతో చలి తీవ్రతతో పాటు దోమల బెడద కూడా తీవ్రంగా ఉన్నదని విద్యార్థులు చెబుతున్నారు. నవాబ్ పేట మండలం ఒక ఎస్సీ, ఒక బీసీ వసతిగృహాలు ఉన్నాయి. బీసీ వసతిగృహంలో గదులు సరిపోవడం లేదు. కళాశాల వసతిగృహం అద్దె భవనంలో కొనసాగుతోంది.

కోళ్ల ఫారాల్లోనే వసతి

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఎంజేపీ గురుకులాలు మొత్తం 40 ఉండగా.. 16472 మంది విద్యార్థులు చదువుతున్నారు. అద్దె భవనాల్లో చాలా గురుకులాలు కొనసాగుతున్నాయి. కొన్ని వసతి గృహాలు పౌల్ట్రీ ఫామ్స్‌లో ఉండటంతో చలికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వేడి నీటి సౌకర్యం ఏ గురుకులంలోనూ లేదు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల్లో ఇరుకు గదులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భోజనశాలలు అపరిశుభ్రంగా ఉన్నాయి. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నప్పటికీ.. నాణ్యత ఉండటం లేదని విద్యార్థులు చెప్తున్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.





మక్తల్ మండల కేంద్రంలో ప్రహరీ కూలిపోయిన ఎస్సీ బాలికల వసతిగృహం, (ఇన్‌సెట్లో) బాలానగర్ ఎస్టీ గురుకుల పాఠశాలలో అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్డి

'కార్పొరేట్'ను కట్టడి చేయాలి

▸ పాలమూరు అధ్యయన వేదిక డిమాండ్

పాలమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ విద్యారంగాన్ని కట్టడి చేయాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక వనరులు, అవకాశాలు స్థానికులకే దక్కాలనే ప్రధాన డిమాండ్‌తో తెలంగాణ ఉద్యమం కొనసాగిందని తెలిపారు. ప్రత్యేకించి విద్యారంగంలో శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థల అక్రమాలను, దోపిడీని పెద్దస్థాయిలో బహిర్గత పరిచిందని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కాగానే, ఆ సంస్థలను రాష్ట్రం వెలుపలికి పంపిస్తామని ఆనాటి ఉద్యమ రాజకీయ నాయకత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా స్పందించిందని తెలిపారు. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఫలితంగా ఆ విద్యాసంస్థలు ప్రభుత్వ కాలేజీలను దివాలా తీయించడమే కాకుండా ఇంటర్ విద్యాబోర్డును అవినీతిమయం చేసి, అబద్దపు ప్రచారాలతో బలపడ్డాయని గుర్తు చేశారు. ఇప్పుడా సంస్థలు తమ దందాను విస్తరిస్తూ జిల్లాలకు వస్తున్నాయని తెలిపారు.

ప్రజలకు హక్కుగా, ఉచితంగా దక్కాల్సిన విద్యను ప్రైవేటు వ్యాపార రంగానికి అప్పగించటమే కాక, దుర్మార్గంగా కార్పొరేట్లకు స్వాధీనపరచడం అన్యాయమని పేర్కొన్నారు. ఇప్పటికే పేద, మధ్య తరగతి వర్గాలు తమ బిడ్డల చదువు కోసం అప్పులపాలై ఆందోళనలో ఉన్నారని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో నారాయణ, చైతన్య వంటి కార్పొరేట్ విద్యాసంస్థలు మహబూబ్ నగర్ వంటి పట్టణాలకు రావడం మధ్య తరగతి కుటుంబాలకు మరింత భారంగా పరిణమిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వారి అబద్ధపు ప్రచారాలను తట్టుకోవటం ప్రభుత్వ విద్యాసంస్థలు, సాధారణ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సాధ్యం కాదని ఇది విద్యారంగ సంక్షోభాన్ని తీవ్రం చేస్తుందని పేర్కొన్నారు.

మునుముందు కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వాన్నే శాసించే స్థాయికి వస్తాయని తెలిపారు. కాబట్టి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని నివారించడం కోసం, కార్పొరేట్ విద్యా సంస్థలు జిల్లాలకు విస్తరించకుండా నియంత్రించాలని, అందుకోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ నెల 14న 'సమూహ' తొలి రాష్ట్ర మహాసభ

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం తొలి రాష్ట్ర మహాసభను ఈ నెల 14న నిర్వహించనున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను బుధవారం పాలమూరు విశ్వవిద్యాలయం ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పట్టణంలోని క్రౌన్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కానున్నదని చెప్పారు. ఈ సందర్భంగా 'లౌకిక ప్రజాస్వామ్య జీవన సంస్కృతి - సాహిత్యం', 'పాలమూరు సమాజం, సాహిత్యం', 'బహుళ అస్తిత్వాలు - సాంస్కృతిక జాతీయ వాద సవాళ్లు' అంశాలపై సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 20 మంది ప్రముఖుల స్వీయ కవితా పఠనం కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఇంటర్వ్యూ..

మెలకువలు పాటిస్తే అధిక లాభాలు

- మండల వ్యవసాయాధికారి కె రమేష్



ఉప్పునుంతల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయ రంగంలో వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించి అధిక లాభాలు పొందవచ్చని ఉప్పునుంతల మండల వ్యవసాయాధికారి కెరమేష్ బుధవారం 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

రైతులు అధిక లాభాలు సాధించాలంటే ఏమి చేయాలి

ప్రధానంగా రైతులు వారి భూమి స్వభావాన్నిబట్టి పంట మార్పిడితో పాటు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ విత్తనాలు విత్తిన నాటి నుంచి పంట చేతికి అందే వరకు మెళకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు

మండలంలో పంటల రుణమాఫీ పథకంలో ఎంత మంది లబ్ధిపొందారు.

మండంలోని 27 గ్రామపంచాయతీలలో నాలుగు విడతల్లో 3635 మంది రైతులకు రూ.26 కోట్ల 95లక్షల 39వేల 974 వందల రుణమాఫీ జరిగింది.

యాసంగిలో మండలంలో వేరుశనగ సాగు విస్తీర్ణం ఎంత

మండంలో ఇప్పటి వరకు 17,350 ఎకరాలలో వేరుశనగను సాగు చేశారు. సబ్సిడీపై ఎలాంటి పనిముట్లు, విత్తనాలు రాలేదు. ప్రతీ రైతు వేదికల్లో వారానికి రెండు రోజుల పాటు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

మండంలో సరిపడా ఏఈవోలు ఉన్నారా ?

మండంలో ఏడుగురు ఏఈవోలు ఉన్నారు. మరో ఇద్దరు ఉంటే బాగుంటుంది.

14న జాతీయ లోక్ అదాలత్

కొల్లాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14వ తేదీన కొల్లాపూర్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు లోక్ అదాలత్ ఛైర్మన్‌కం ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి జ్యోత్స్న గుంటి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ నందు కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, కోడేరు, పెంట్లవెల్లి మండలాలకు చెందిన సివిల్, క్రిమినల్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తారని తెలిపారు. బ్యాంకులలో చిరకాలంగా బకాయిలు ఉన్న కేసులను కూడా వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా తొలగిస్తారని, ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని ఆమె తెలిపారు.

'బస్సులు వేళకు నడపాలి'

కోడేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి వేళకు బస్సులు నడపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరసింహ అధికారులను కోరారు. బధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడేరు మండల కేంద్రానికి వేళకు బస్సులు రాకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే ఉదయం 7.30కు కోడేరుకు వచ్చే హైదరాబాద్ బస్సు ఒక రోజు వచ్చి రెండవ రోజు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయనతో పాటు సీపీఎం నాయకులు లక్ష్మయ్య, రవి, వెంకటయ్య, బుచ్చన్న పాల్గొన్నారు.


కొనసాగుతున్న పశువైద్యశిబిరం

వెల్దండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ సేవాపథకంలో భాగంగా మండల పరిధిలోని చొక్కన్నపల్లి, బండోన్‌పల్లి, బర్కత్‌పల్లి గ్రామాలలో పశుసంవర్ధకశాఖ, విజ డెయిరీల ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని జిల్లా పశువైద్యాధికారి జీవీ రమేష్ ప్రారంభించారు. శిబిరంలో గర్భకోశవ్యాధి చికిత్సలు, సాధారణ చికిత్సలు నిర్వహించారు. శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా రమేష్ సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్యాంసుందర్, ప్రశాంత్‌రెడ్డి, రాంసింగ్, లక్ష్మి, విజయ డెయిరీ మేనేజర్ ప్రియాంక, బీఎంసీయూ వైస్‌ఛైర్మన్ శశిధర్‌రెడ్డి, సిబ్బంది నరేష్‌రెడ్డి, వెంకన్న, ఫణీందర్‌రెడ్డి, నర్సింహ, శ్రీను, తిర్పతయ్య, బాలు, మొగులయ్య, సాయిబాబా, విజేందర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'సీసీఐ కేంద్రాలకు నాణ్యమైన పత్తిని తీసుకురావాలి'

కందనూలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు సీసీఐ కేంద్రాలకు తాము పండించిన పత్తిని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సీసీఐ అధికారి భన్సల్‌లాల్ రైతులకు సూచించారు.బుధవారం కొంత మంది రైతులు నల్లబారిన పత్తి తీసుకురావడతో ఇలాంటి పత్తి సీసీఐ కేంద్రాలకు పనికి రాదని, నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. రైతులందరూ పత్తిని మంచిగా శుద్ధి చేసి తమకు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జైపాల్



చారకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ ద్వారా యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఓటింగ్ నిర్వహించడంతో మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన నాయిని జైపాల్ యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.బుధవారం వెలువడిన యూత్ కాంగ్రెస్ ఫలితాల్లో 600 ఓట్లు సాధించాడు. జైపాల్ మాట్లాడుతూ ఎన్నికల్లో సహకరించిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు, యూత్ కాంగ్రెస్ నాయకులకు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపయోగంగా బస్టాండ్

- పెంట్లవెల్లి బస్టాండ్‌లో చెత్తాచెదారం, మురుగునీటితో దుర్గంధం

- బస్టాండ్‌లో బస్సులు ఆపాలని కోరుతున్న ప్రయాణికులు

-ఎండకు, వానకు ప్రయాణికుల అవస్థ

పెంట్లవెల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం లో ప్రయాణికుల సౌకర్యార్థం సుమారు ముప్పై ఏళ్ల క్రితం బస్టాండ్ నిర్మించారు. కానీ, ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో మూన్నాళ్ళ ముచ్చటగా మిగిలింది. లక్షలు ఖర్చు పెట్టి నిర్మించిన బస్టాండ్ కంప చెట్లు, చెత్తాచెదారంతో దర్శనమిస్తుంది. పెంట్లవెల్లి గ్రామ పంచాయతీగా ఉన్నటికీ అనేక ఏళ్ల నుంచి వ్యాపార కేంద్రంగా ఉండేది. అప్పట్లో కర్నూల్, ఆత్మకూరు, గద్వాల డిపోలకు చెందిన బస్సులు స్వల్పంగా వచ్చిపోయేవి. ఇప్పుడు మండలం అయ్యింది. అటు కొల్లాపూర్‌లో బస్ డిపో కావడంతో కొల్లాపూర్ నుంచి పెబ్బేరుకు రాకపోకలకు బస్సుల సంఖ్య పెరిగింది. పెంట్లవెల్లి సమీపంలోని మల్లేశ్వరం, మంచాలకట్ట, లింగంపల్లితండా, మాధవిస్వామి నగర్ తదితర గ్రామాలు, అటు పెబ్బేర్ వరకు ఉన్న గ్రామాల ప్రయాణికులకు ఈ బస్టాండ్ అనువుగా ఉంటుంది. కనీసం ఒక బస్సు కూడా బస్టాండ్ లోపలికి వెళ్లదు. బస్సులు రాకపోవడంతో బస్టాండ్ నిరుపయో గంగా మారింది. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ బస్సులు ఎక్కాలంటే పిల్లలు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతుంటారు. రాత్రి వేళలో బస్సులు ఆపక పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతు న్నారు. బస్టాండ్‌కు కనీసం బోర్డు కూడా లేదు. బస్టాండ్‌కు అన్ని వసతులు ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ సమీపంలో గ్రా మంలోని మురుగు నీరు ఎప్పుడు నిండి ఉంటుంది. అదే విధంగా కంప చెట్లు, చెత్తాచె దారంతో నిత్యం పందులు స్వైరవిహారం చేస్తుంటాయి. గతంలో ఎన్నోసార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలోకి బస్సులు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్ ఆవరణలో నిలిచిన మురుగునీరు

చెత్తాచెదారం పడేస్తున్నారు



బస్టాండ్ నిరుపయోగంగా ఉండటంతో సమీప ప్రాంతాల ప్రజలు చెత్తను బస్టాండ్ ఆవరణలో వేస్తున్నారు. ఆయా కాలనీల నుంచి మురుగునీరు బస్టాండ్‌లో చేరుతోంది. దీంతో బస్టాండ్ ఆవరణం దుర్గంధమైన వాసన వస్తోంది. దోమల వ్యాప్తి అధికమైంది.

- ఖాస్కర్ పెంట్లవెల్లి

అధికారులు పట్టించుకోవడం లేదు



బస్సులు బస్టాండ్ లోకి వెళ్లకపోవడంతో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ బస్సులు ఎక్కాలంటే పిల్లలు, వృద్ధులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఎన్నో సార్లు పెంట్లవెల్లి బస్టాండ్‌లో బస్సు నిలుపాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వచ్చాం. కానీ, అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు చొరవ చూపి బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలి.

- హరిప్రసాద్

పెండింగ్ డబ్బులు చెల్లిస్తేనే సర్వే కొనసాగిస్తాం

- ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కళావతి

- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న పల్స్ పోలియో సర్వే డబ్బులను చెల్లిస్తేనే ప్రభుత్వం చేపట్టిన లెప్రసీ సర్వే కొనసాగిస్తామని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కళావతి ప్రభుత్వానికి స్పష్టం చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తం గా ఆశా వర్కర్లతో లెప్రసీ స ర్వే చేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశించి శిక్షణలు కూడా నిర్వహించిందని పేర్కొన్నారు. గతంలో చేసిన పల్స్ పోలియో సర్వే డబ్బులు చెల్లించిన తర్వాతే ఆశా వర్కర్లతో కొత్త సర్వే చేయించాలన్నారు. పల్స్ పోలియో సర్వే డబ్బులు ఇప్పటికే అన్ని జిల్లాలో ఇచ్చారని, ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో నేటికీ అందలేదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా ఉపవైద్యాధికారి వెంకటదాసుకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, సహాయ కార్యదర్శి రామయ్య, నాయకులు అశోక్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నమ్మ, ఉపాధ్యక్షురాలు స్వప్న, శ్రీదేవి, వసుంధర, నర్మద, కృష్ణవేణి, భాగ్యమ్మ, వెంకటమ్మ, శకుంతల, సువర్ణ, మానస, లక్ష్మి, చంద్రకళ, మాణిక్యమ్మ, మమత, శోభ, అమీనా తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఘన సన్మానం

మన్ననూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణి సంరక్షణ బోర్డు సభ్యుడిగా ఎన్నికైన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను మన్ననూరు అటవీ అతిథి గృహం వద్ద స్థానిక కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటయ్య, డైరెక్టర్ నది హన్మంత్‌రెడ్డి, కోఆప్షన్ మాజీ సభ్యుడు రహీం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు తుల్యా, రవికుమార్, రమణ గౌడ్, రాజారాం, బుచ్చయ్య, వెంకటేశ్వర్లు, కర్ణయ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వంశీకృష్ణను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

● పదర : ఎమ్మెల్యే వంశీకృష్ణ వన్యప్రాణి బోర్డు సభ్యుడిగా ఎన్నికవడం పట్ల వంశీ యువసేన మండల అధ్యక్షుడు హర్షం వ్యక్తం చేశారు. మరింత బాధ్యత పెరిగిందన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై 10న బైక్ ర్యాలీ

- బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి

కందనూలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఈనెల 10వ తేదీన భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేపీ సంస్థాగత ఎన్నికల సహా ఇన్‌చార్జ్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దొడ్ల రాజావర్ధన్‌రెడ్డి అన్నారు. బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై '6 అబద్దాలు-66 మోసాల రాష్ట్ర సర్కార్' పేరుతో చార్జీషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి సంవత్సరం పూర్తైనా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి 80వేల కోట్ల అదనపు అప్పులు చేసి గొప్పలు చెబుతోందన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

వన్యప్రాణులు, అడవుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

మన్ననూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మన్ననూరు, అచ్చంపేట, అమ్రాబాద్‌కు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై క్విజ్, వ్యాస రచన పోటీలను ఏటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అటవీ విద్యాధికారిణి శ్వేత విద్యార్థులను అడవిలో సఫారీ వాహనాల్లో వ్యూపాయింట్ టూర్‌కు తీసుకెళ్లారు. పర్యావరణ విజ్ఞానకేంద్రం పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎఫ్‌డీ రాంబాబు బహుమతులను అందజేశారు. డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, ఎఫ్‌డీవో రామమూర్తి, అధికారి దేవజ డీఆర్‌ఓ రవికుమార్ పాల్గొన్నారు.

జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

- మాదిగ జేఏసీ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జీ జయశంకర్

నాగర్‌కర్నూల్‌టౌన్/ కల్వకుర్తి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో జిల్లాల వారిగా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మాదిగ జేఏసీ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జీ వంగూరి జయశంకర్ డిమాండ్ చేశారు. మాదిగ జేఏసీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బోడ సరేందర్, కార్యదర్శిగా వినోద్‌లకు నియామక పత్రాలను అందజేశారు. జయశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రిఉత్తమ్‌కుమార్‌రెడ్డి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని చెప్పడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మాదిగ జేసీ మండల అధ్యక్షుడు హుస్సేన్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలుపర్చాలి

కల్వకుర్తి : ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలుపర్చాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ భవన్‌లో ఎమ్మార్పీఎస్, రాజకీయ పార్టీల జేఏసీ, మాదిగల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ అంశంపై సమావేశం జరిగింది. కొంతమంది పనిగట్టుకుని వర్గీకరణను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో వీరస్వామి మాదిగ, మబ్బు రామారాజు, జంగయ్య, మల్లేష్, శేఖర్, రామస్వామి, కృష్ణ, జంగయ్య, భాస్కర్, కానుగుల జంగయ్య, గోపాల్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీపురంలో బైకుకు నిప్పంటించిన గుర్తు తెలియని దుండగులు

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీపురం గ్రామంలో గుర్తు తెలియని దుండగులు బైక్‌కు నిప్పంటించారు. ఎస్‌ఐ గోవర్దన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుంటి మల్లేష్ మంగళవారం రాత్రి ఇంటి ఆవరణలో సీడీ 100 బైక్‌ను పార్కు చేసి ఇంట్లో ఉండగా గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. ఇంతలోనే చేరుకున్న మల్లేష్ నీళ్లతో చల్లార్చారు. అప్పటికే వాహనం దగ్ధమైంది. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

తెలకపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు బాల్య వి వాహాల నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలని కోనేరు సంస్థ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్న ముద్దునూర్ గ్రామపంచాయతీ దగ్గర కోనేరు సంస్థ, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో "బాల్య వివాహ విముక్త భారతదేశం" అనే అంశంపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. చైల్డ్ ట్రాఫికింగ్, చైల్డ్ సెక్సువల్ అబ్యూస్, చైల్డ్ మ్యారేజ్, బాల్య వివాహాలు చేస్తే వచ్చే నష్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం పద్మా, ఎంఎల్‌హెచ్ డాక్టర్ కల్పన, కోనేరు సంస్థ కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్, రజిత, నిరంజన్, జానకి రామ్, రాణి, మహాదేవమ్మ, బంగారయ్య, నరసింహారెడ్డి, వేమిరెడ్డి, లక్ష్మమ్మ, హెల్త్ అసిస్టెంట్ బాలస్వామి పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీటీమ్ ప్రధాన లక్ష్యం

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలో షీటీ బృందాలు ప్రభుత్వ కళాశాలల్లో, పట్టణ వీధుల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపట్టి విద్యార్థినులు, బాలికలను చైతన్య పరుస్తూ రాష్ట్రానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఏఎస్పీ రామేశ్వర్ అన్నారు. గత నవంబరులో జిల్లా వ్యాప్తంగా ఈవ్ టీజింగ్ చేస్తున్న 9మందిపై ఫిర్యాదులు వచ్చాయని, అందులో ఒకరిపై కేసు, 8మందికి కౌన్సెలింగ్ చేసినట్లు తెలిపారు. మహిళలకు ఎలాంటి ప్రమాద పరిస్థితి ఏర్పడిన వెంటనే డయల్ 100కు లేదా షీటీం మొబైల్ నెంబరు 8712657676కు సంప్రదించాలన్నారు.

బీఆర్ఎస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు

కందనూలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్వీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నాగర్‌కర్నూల్ జ్యోతిరావుపూలే గురుకులాన్ని బుధవారం బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు సందర్శించారు. వారిని స్థానిక పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు బీఆర్ఎస్ నాయకులకు వాగ్వాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గురుకులాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నదని వారు ఆరోపించారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కల్పన, మునిసిపల్ కౌన్సిలర్లు విజయమ్మ, తేజ, బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేటటౌన్ : ప్రభుత్వం విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని బీఆర్ఎస్ నాయకులు శంకర్ మాదిగ అన్నారు. బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంశీ, రవి, రాకేష్, రాజు, జానీ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మల్లేష్

తాడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రెండు నెలల క్రితం జరిగిన కాంగ్రెస్ పార్టీ యువజన విభాగాలకు సంబంధించిన ఆన్‌లైన్ ఎన్నికలు జరిగాయి. ఇందులో యువత పెద్ద ఎత్తున పాల్గొని నచ్చిన వ్యక్తులకు ఆన్‌లైన్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ క్రమంలోనే బుధవారం యువజన కాంగ్రెస్‌కు సంబంధించిన ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాయి. దీంతో తాడూరు మండల యూత్ ప్రెసిడెంట్‌గా పర్వతాయిపల్లి గ్రామానికి చెందిన శ్రీనుపై సిర్సవాడ గ్రామానికి చెందిన మల్లేష్ గెలుపొందారు. మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన అభినందనలు వెల్లువెత్తు తున్నాయి.

అంధత్వ నియంత్రణ సామాజిక బాధ్యత : ప్రిన్సిపాల్ సైదులు

బల్మూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అంధత్వ నియంత్రణ మన సామాజిక బాధ్యత అని కొండనాగుల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సైదులు అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కంటి శిబిరంలో ఆప్తాలమిక్ డాక్టర్ గణేష్ బృందం 200మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆరు మంది విద్యార్థులను కంటి లోపం ఉన్నట్లుగా గుర్తించారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శేఖర్, శోభారాణి, అనిత, శైలజ, ఆంజనేయులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి కృషి

- పోలీస్ పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ, ఐవోఎల్ మేనేజర్



పోలీస్ పెట్రోల్ బంకును ప్రారంభించాక వాహనానికి పెట్రోల్ పోస్తున్న సిబ్బంది చిత్రంలో కలెక్టర్, ఎస్పీ, ఐవోఎల్ మేనేజర్

నాగర్‌కర్నూల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసుల సంక్షేమానికి ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అవసరమైన నిధులను, వనరులను సమకూరుస్తూ పెద్దపీట వేస్తున్నారని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన పోలీస్ సంక్షేమ పెట్రోల్ బంకును ఎస్పీ, కలెక్టర్‌లు సికింద్రాబాద్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ డీఎం సుదీప్తోమిత్ర, అదనపు ఎస్పీలతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ సంక్షేమ నిధికి కొద్ది మొత్తంలో మాత్రమే నిధులు మంజూరయ్యాయని తెలిపారు. దీంతో జిల్లా పోలీస్ శాఖను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కొన్ని వాణిజ్య నిర్మాణాలు చేపట్టి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పోలీస్ సంక్షేమానికి వినియోగించనున్నట్లు తెలిపారు. అందుకు అవసరమైన వనరులు, సదుపాయాలను కల్పించడంలో ఎస్పీ పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ అనుమతులు తదితర వసతులను ఏర్పాటు చేసేందుకు అదనపు ఎస్పీ భరత్‌కుమార్ కృషి చేశారని తెలుపుతూ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు నాణ్యమైన ఇంధనాన్ని అందించి ప్రజల మన్ననలతో దినదిన అభివృద్ధికి కృషి చేయాలని, పోలీస్ సంక్షేమానికి పాటుపడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రామేశ్వర్, భరత్‌కుమార్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు, డీఎస్పీలు సీఐలు, ఎస్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నివర్గాల శ్రేయస్సు కోసమే ప్రజాపాలన

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి

వెల్దండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల శ్రేయస్సు కోసమే కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన అందిస్తోందని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్ల వంశీచంద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. రైతురుణమాఫీ, వరికి బోనస్ ఇస్తున్నామన్నారు. ఆరు గ్యారెంటీలను అమలుచేసే బాధ్యత పార్టీ తీసుకుంటుందన్నారు. సమావేశంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, అధ్యక్షుడు మోతీలాల్, యువజనకాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శులు శేఖర్, చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, మిర్యాలశ్రీనివాస్‌రెడ్డి, నాయులు పుల్లయ్య, నారాయణ, ఎర్రశ్రీను, రమేష్, శ్రీనుయాదవ్, శివరాజ్, చందు, వెంకట్‌నాయక్



విలేకరులతో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

ఘనంగా మాజీ సీఎం రోశయ్య వర్ధంతి

తెలకపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత రోశయ్య వర్ధంతి వేడుకలను బుధవారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రోశయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, మహిళ శ్రీదేవికి కుట్టు మిషన్ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి, మండల కాంగ్రెస్ నాయకులు, మహిళలు, క్లాస్‌మేట్ క్లబ్ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.



రోశయ్య వర్ధంతిలో పాల్గొన్న నాయకులు, క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు

ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

కల్వకుర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలను డీఈవో రమేష్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈవోగా పదవీ బాధ్యతలు తీసుకున్న తొలిరోజే తనిఖీ చేపట్టారు. పాఠశాలలోని రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. పదవ తరగతిలో విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరిశీలించి సబ్జెక్టును బోధించారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని ఆయన సూచించారు. డీఈవో వెంట ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్‌రావు, కల్వకుర్తి ఎంఈవో శంకర్ నాయక్, కార్యాలయ పర్యవేక్ష కులు నాగేంద్రకుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విద్యార్థుల స్థాయిని పరిశీలిస్తున్న డీఈవో రమేష్‌కుమార్

కోదండ రామాలయం భూములను కాపాడాలి

- ఎంపీడీవోకు గ్రామస్థుల వినతి

అమ్రాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్‌లోని కోదండ రామాలయం భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని అమ్రాబాద్ గ్రామస్థులు బుధవారం ఎంపీడీవో వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. 1330 సర్వే నెంబర్‌లోని 15 ఎకరాలకు పైగా భూమి ఉందని తెలిపారు. అందులోని కొంత భూమి ఆక్రమణదారుల ఆధీనంలో ఉందని, జిల్లా నుంచి వచ్చిన సర్వే అధికారులు హద్దులు గుర్తించారని తెలిపారు. ఆ ప్రకారంగా ఆలయానికి సంబంధించిన భూమిని కాపాడాలని వారు ఎంపీడీవోకు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. ఈ భూమి పైన విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుం టామని ఎంపీడీవో హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో శ్రీకాంత్, తిరుపతయ్యగౌడ్, రాములు గౌడ్, శ్రీనివాసులు, నాగరాజు, సత్యనారాయణ, రేణయ్య ఉన్నారు.

వందశాతం పూర్తైన ఆన్‌లైన్ ప్రక్రియ

- మండల నోడల్ ఆఫీసర్ రామార్జున

తాడూరు/ తిమ్మాజిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి అన్ని కుటుంబాల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తైందని మండల నోడల్ అధికారి రామార్జున అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కుటుంబ సర్వే దరఖాస్తు ఫామ్‌ల ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని 24గ్రామ పంచాయతీల పరిధిలో 8 వేల 48కుటుంబాలకు సంబంధించి సర్వే పూర్తైందని, దీంతో నేటి వరకు వంద శాతం ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. ఎంపీడీవో బ్రహ్మచారి, ఏపీవో చంద్రసిద్దార్థ, పంచాయతీ కార్యద ర్శులు ఉన్నారు.

● తిమ్మాజిపేట మండలంలోనూ సమగ్ర ఇంటింటి సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ వందశాతం పూర్తి చేశామని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశమయ్యారు. 12258 కుటుంబాలు ఉన్నాయని, అందరి సర్వే వివరాలను కంప్యూటరీకరణ చేసినట్లు తెలిపారు. మండలంలో సర్వే చేయడంలో అందరి సహకారంతో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్నామని, కలిసి పని చేసిన అందరికీ అభినందనలు తెలిపారు.

శివసేనారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

తిమ్మాజిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డికి యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొనిదల రాము, ప్రధాన కార్యదర్శి దానం బాలరాజు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని శివసేనారెడ్డిని ఆయన నివాసంలో బుధవారం కలిసి శాలువా కప్పి సన్మానించి కేక్ కట్ చేశారు. గ్రామీణ ప్రాంతం లోని క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి చొరవ చూపాలని క్రీడాకారులకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని వారు కోరారు.



స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు